# కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ క్షేమం

- దొంగలంతా హైదరాబాద్‌కు చేరారు
- వారి చేతుల్లోకి పోకుండా చూసుకోవాలి
- ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరవలేనిది
- మంత్రి గంగుల కమలాకర్
- ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం



ఆర్టీసీ ఆత్మీయ సమ్మేళనంలో భోజనాలు వడ్డిస్తున్న మంత్రి గంగుల

కార్పొరేషన్, అక్టోబర్ 28 : తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ చేతుల్లో ఉంటేనే క్షేమంగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన స్థానిక శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆర్టీసీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై వారినుద్దేశించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పోరాటం మరువలేనిదన్నారు. సాధించుకున్న తెలంగాణను ఇప్పుడు ఆంధ్రా దొంగల, ఢిల్లీ చేతుల్లోకి పోకుండా చూసుకోవాలని సూచించారు. 50 ఏళ్ల కాలంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా కరీంనగర్ అభివృద్ధిలో ఎలాంటి మార్పులూ రాలేదన్నారు. నగరమంతా మట్టిరోడ్లు, అడ్డదిడ్డంగా మురికి కాల్వలు ఉండేవన్నారు. 50 ఏళ్ల దరిద్రాన్ని, పదేళ్లలో జరిగిన అభివృద్ధిని గమనించాలని కోరారు. సమైక్యాంధ్రలో నగరాభివృద్ధికి రూ.కోటి ఇవ్వాలని అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని కోరితే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. నాడు ఆంధ్రాలో కొబ్బరిచెట్లు దెబ్బతింటే నాయకులంతా కట్టగట్టుకొని పోయి పరిహారం అందించేవారని, కానీ తెలంగాణలో పొలాలు ఎండినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. సమైక్యాంధ్రలో సాగునీరు, కరెంటు, ఉద్యోగాల కోసం అరిగోసపడ్డామన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిందని, నగరం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే మొదటిసారి నగరాభివృద్ధి కోసం నిధులు అడిగితే రూ.350 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు తెలంగాణలో సాగుతున్న అభివృద్ధిని చూసి ఆంధ్రా నాయకులకు కళ్లు మండుతున్నాయని విమర్శించారు. అందుకే హైదరాబాద్‌లో దొంగలంతా చేరారని, కేసీఆర్ ఓడిపోతే హైదరాబాద్ సంపదను దోచుకుని పోదామని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లుగా అభివృద్ధి సాగుతుందని, దీనిపై కళ్లమంట మొదలైందని విమర్శించారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి నాడు తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడి, ఇప్పుడు బీజేపీ ముసుగులో హైదరాబాద్‌లో అడ్డా వేశారని మండిపడ్డారు. ఆంధ్రాకు చెందిన నాయకులందరూ ఇప్పుడు హైదరాబాద్‌లోనే ఉన్నారని, కేసీఆర్ ఓడిపోతే ఆంధ్రాలో కలిపేసుకుందామని ఎదురుచూస్తున్నారని ధ్వజమెత్తారు. 56 ఏళ్ల క్రితం మన తాతలు తప్పులు చేస్తే మనం కష్టాలు పడ్డామని, ఇప్పుడు మళ్లీ అదే తప్పు చేస్తే పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. ఢిల్లీ చేతుల్లోకి తెలంగాణ పరిపాలన పోతే 1956లో ఏం చేశారో ఇప్పుడు అదే చేస్తారని విమర్శించారు. హైదరాబాద్‌లోని సంపదను దోచుకుపోవాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. 50 ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు మళ్లీ ఈ ఎన్నికల్లో ఒక్క ఓటు వేయాలని కోరుతున్నాయని, వారికి ఓటు వేస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని అక్కడి రైతులు తెలంగాణకు వచ్చి కాంగ్రెస్ వారిని నమ్మవద్దని తమను మోసం చేశారని చెప్తున్నారని మండిపడ్డారు. బస్సులో మహిళలకు ప్రయాణం ఉచితం అన్న కాంగ్రెస్ ఇప్పుడు బస్సులే నడపడం లేదన్నారు. తెలంగాణ ప్రజలు కూడా ఆచితూచి ఓటు వేయాలని, ఒక్క ఓటు తప్పు చేస్తే 50 ఏళ్లు వెనక్కి పోతామని హెచ్చరించారు. కుక్కలు చింపిన ఇస్తరి చేస్తారని విమర్శించారు. కాంగ్రెస్‌ను నమ్మితే భవిష్యత్తు అంధకారంగా మారిపోతుందన్నారు. సమావేశంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఆర్టీసీ సంఘ నాయకులు జక్కుల నాగరాజు, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# రేపటి నుంచి శబరిమల పాదయాత్ర

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 28: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయం నుంచి శబరిమల వరకు మహాపాదయాత్ర ఈనెల 30న ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నట్లు మహా పాదయాత్ర గురుస్వామి గడప నాగరాజు పేర్కొన్నారు. భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భగత్‌నగర్‌లోని జడ్పీ క్వార్టర్స్‌లో గల హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో సోమవారం ఉదయం ఇరుముడి కట్టుకొని మహా పాదయాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. ఈ పాదయాత్ర కరీంనగర్ నుంచి హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, అనంతపూర్ మీదుగా కర్ణాటకలోని చిబ్బల్లాపూర్, దేవనల్లి, తమిళనాడులోని ఉర్సూర్, సేలం కేరళలోని కుమిలి, పులిమేడ నుంచి అయ్యప్ప స్వామి సన్నిదానం చేరుకుంటుదన్నారు. డిసెంబర్ 14న స్వామివారిని దర్శించుకుని తిరుగు పయనమవుతామని చెప్పారు. ఇక్కడ కంటె రాజ్ కుమార్ గురుస్వామి, నమిలికొండ రమేశ్ గురుస్వామి, గంగుల సురేశ్ గురు స్వామి, పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 28 : నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని రిటర్నింగ్ అధికారికి మహేశ్వర్ సూచించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయంలో శనివారం పలు పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాలకు 48 గంటల ముందు సువిధ యాప్ ద్వారా దరఖాస్తులు చేసి అనుమతి పొందాలని స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేయాలి

బోయినపల్లి, అక్టోబర్ 28: కార్యకర్తలు, నా యకులు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విజయానికి సమిష్టిగా కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు కో రారు. శనివారం బోయినపల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థిగా సుంకె రవిశంకర్ పేరును ఖరారు చేయగా ఆయన గెలుపును కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు జోగినపల్లి ప్రేంసాగర్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సు ధాకర్, మండల రైతుబంధు సమితి కన్వీనర్ లచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వైస్ ఎం పీపీ నాగయ్య, సర్పంచులు పాల్గొన్నారు.

## రేవతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు

వేములవాడ టౌన్, అక్టోబర్ 28 : రేవతి నక్షత్రం సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీరాజరాజేశ్వర స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ అనంత పద్మనాభ స్వామివారికి పంచోపనిషత్తుల ద్వారా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట : అక్టోబర్ 28 : మండలంలోని తిప్పాపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నామని ఎస్ఐ సుధాకర్ అన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామన్నారు.

# అంధులకు బ్రెయిలీ లిపిలో డమ్మీ బ్యాలెట్

- ఈవీఎంల పక్కన అతికించనున్న అధికారులు

కలెక్టరేట్, అక్టోబర్ 28: ఇతరుల సాయం లేకుండా సొంతంగా ఓటు వేయాలనే అంధుల కోరికను ఎన్నికల కమిషన్ నెరవేర్చుతోంది. వారికోసం బ్రెయిలీ లిపిలో డమ్మీ బ్యాలెట్లు తయారు చేసి, ఈవీఎంల పక్కన అతికించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అంధులు అధికంగా ఉండే పోలింగ్ బూత్‌లను ఎంపిక చేసి ఆ కేంద్రాల్లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు అతికించనున్నారు. దీంతో తమకు ఇష్టమైన వారికి ఓటు వేసుకునే స్వేచ్ఛ వారికి లభించబోతుంది. అంధత్వంతో సొంతంగా ఓటు వేసే అవకాశం లేకపోవడంతో వారికి సహాయకులుగా వచ్చే వారు, పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మాత్రమే అంధులు చెప్పిన వారికి ఓటు వేసే విధానం కొనసాగుతున్నది. అయితే, ఇది అంధుల్లో అసంతృప్తిని మిగుల్చుతోంది. తాము చెప్పిన వారికే ఓటు వేసారా లేక వారికి ఇష్టమైన వారికి వేసారా అనే అనుమానంతో పాటు సొంతంగా ఓటు వేయలేకపోయామనే బాధ కూడా వారిలో వ్యక్తమయ్యేది. దీనిని గమనించిన ఎన్నికల సంఘం ఈవీఎంలపై బ్రెయిలీ లిపితో రూపొందించిన సంఖ్యలను అతికిస్తూ, సొంతంగా ఓటేయాలనే కోరికను తీర్చుతోంది. అంధుల పురోగమనానికి మార్గదర్శిగా మారిన బ్రెయిలీ లిపి ఆధారంగానే 70శాతానికి పైగా తమ పనులు తామే చేసుకోగలుగుతున్నారు. అలాగే, ఓటు హక్కు కూడా సొంతంగా వినియోగించుకునేలా బ్యాలెట్ యంత్రాలపై డమ్మీ బ్యాలెట్లు అతికిస్తున్నారు. ఈవీఎంలో కుడివైపు నుంచి 18 మీటలుంటాయి. ఎడమవైపు అభ్యర్థుల ఫొటోలు, పార్టీ పేరు, గుర్తులు కనిపిస్తాయి. అంధుల కోసం ఈవీఎంలలో కుడివైపు ఒకటి నుంచి 18 వరకు బ్రెయిలీ లిపి సంఖ్యలు కుడివైపు మీటల పక్కనే అతికిస్తారు. ఓటు వేసేందుకు వెళ్లే అంధులకు సంబంధిత పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహించే ఎన్నికల అధికారులు అభ్యర్థుల వివరాలు, నెంబర్లతో కూడిన డమ్మీ బ్యాలెట్ అందిస్తారు. ఓటు వేయడంపై వారికి అవగాహన కల్పిస్తారు. అనంతరం వారిని ఈవీఎంల వద్దకు పంపుతారు. అంధ ఓటరు ఈవీఎంపై బ్రెయిలీ లిపితో అతికించిన సంఖ్యను గుర్తించి, తాను ఓటు వేయాలనుకున్న అభ్యర్థి నెంబర్‌పై మీట నొక్కుతాడు. దీంతో, తాను అనుకున్న వ్యక్తికి ఓటు పడుతుంది. ఎవరి సాయం లేకుండా తాను ఓటు వేశాననే సంతృప్తి అంధ ఓటరుకు కలుగుతుంది. ఓట్లు కూడా పక్కదారి పట్టకుండా ఉంటుందనే భావనతో ఎన్నికల సంఘం వీటికి రూపకల్పన చేసి, గత ఎన్నికల నుంచి అమలు చేస్తున్నది.

## కేంద్రం వైఖరితోనే ఉపాధి హామీ నిర్వీర్యం

కలెక్టరేట్, అక్టోబర్ 28: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితోనే దేశ వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమవుతున్నదని ఆలిండియా ఉపాధి హామీ కూలీల సంఘం జిల్లా అధ్యక్షుడు పసునూరి వాసుదేవ్ ఆరోపించారు. నగరంలోని కమాన్ సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉపాధి హామీ కూలీలతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఏబీపీఎస్ విధానంతో కేంద్రం జాబ్‌కార్డులు తగ్గిస్తోందని మండిపడ్డారు. జాబ్‌కార్డులను తొలగించి, ఈ పథకాన్ని అటకెక్కించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని, ఇందులో భాగంగానే ఇటీవల జిల్లాలో వందల సంఖ్యలో జాబ్‌కార్డులు రద్దు చేసినట్లు ఆరోపించారు. సమావేశంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

తెలంగాణచౌక్, అక్టోబర్ 28: అంబేద్కర్ స్టేడియంలో వచ్చే నెల 4న నిర్వహించే ప్రజాగర్జన సభ విజయవంతం కావాలని నగరంలోని పాత బజార్‌లో గల కరీముల్లాషా దర్గాలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇక్కడ కుల సంఘాల జేఏసీ చైర్మన్ జీఎస్ ఆనంద్, గౌడ సంఘం నాయకుడు కలర్ సత్తన్న, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ పాల్గొన్నారు.

## దక్షిణ భారత జోన్ స్కిల్ ట్యాంక్ ఎగ్జిబిషన్‌కు పారమిత విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రసాదరావు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 28: జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో గల పారమిత హెరిటేజ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శుభశ్రీ సాహు శాస్త్రీయ ఆవిష్కరణలో చేసిన కృషికి దక్షిణ భారత జోన్ స్కిల్ ట్యాంక్ ఎగ్జిబిషన్‌కు జోనల్ రౌండ్‌కు ఎంపికైంది. స్కిల్ ట్యాంక్ సీజన్-1 జోనల్ రౌండ్‌కు, దక్షిణ జోన్ నుంచి 500 మందికి పైగా పాల్గొననుండగా, అందులో శుభ శ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా పేర్కొన్నారు. ఈ క్రమంలో శుభ శ్రీ సాహును పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రాకేశ్, వీయూఎం ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

# అధ్యాపకురాలికి డాక్టరేట్

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 28 : జిల్లా కేంద్రానికి చెందిన శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం పూర్వ విద్యార్థిని వడ్నాల జ్యోత్స్నదేవికి కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి వడ్నాల జ్యోత్స్నదేవికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. హ్యూమన్ రైట్స్ 'ది స్టడీ ఆఫ్ గీత హరిహరన్స్ సెలక్ట్ నావెల్స్' అంశంపై కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్ డాక్టర్ మేఘనా రావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. జ్యోత్స్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.